## క్లుప్తంగా

### ఆండాళ్లమ్మకు తిరువీధి సేవ



ఉపమాకలో ఆండాళ్లమ్మవారికి తిరువీధి సేవ నిర్వహిస్తున్న అర్చకులు

నక్కపల్లి: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి కుంకుమార్చన చేశారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు నిత్యార్చనలు, పంచామృతాభిషేకం నిర్వహించారు. కొండ దిగువ ఉత్సవమూర్తులకు, క్షేత్రపాలకుడు వేణుగోపాల స్వామికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆండాళ్లమ్మవారి సన్నిధిలో కుంకుమార్చన చేశారు. తదుపరి స్వామివారికి, అండాళ్లమ్మవారికి తిరువీధి సేవలు నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు పాల్గొన్నారు.

### నేడు పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం



గోపాలపట్నంలో ప్రారంభించనున్న రైతు భరోసా కేంద్రం

పాయకరావుపేట: మండలంలోని గోపాలపట్నంలో పలు అభివృద్ధి పనులను శనివారం ప్రారంభించనున్నట్టు ఎంపీడీవో ఎ.సాంబశివరావు తెలిపారు. రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ. 25 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.17.5 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ సెంటర్‌ను రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి ఎంపీ బి.వి.సత్యవతి, ఎమ్మెల్యే గొల్ల బాబూరావులు ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నట్టు ఎంపీడీవో చెప్పారు.

### ఫ్యామిలీ డాక్టర్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



తోటాడలో చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

మునగపాక: ప్రతి ఒక్కరూ ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి కోరారు. మండలంలోని తోటాడ పంచాయతీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. డాక్టర్ రవికుమార్ వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత దొడ్డి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### రెండు గ్రామాల్లో పాలవెల్లువ సదస్సులు



పాల వెల్లువ సదస్సులో మాట్లాడుతున్న వెటర్నరీ డాక్టర్ వాత్సల్య

అచ్యుతాపురం(అనకాపల్లి): నేషనల్ లైవ్ స్టాక్ మిషన్‌లో భాగంగా అచ్యుతాపురం మండలంలోని దోసూరు,తంతడి గ్రామాల్లో శుక్రవారం జగనన్న పాల వెల్లువ సదస్సులు నిర్వహించారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సుల్లో వెటర్నరీ డాక్టర్ వాత్సల్య మాట్లాడుతూ పాల ఉత్పత్తిని పెంచడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.డీసీసీబీ మేనేజర్ నారాయణ, స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.

### మాజీ సర్పంచ్ జ్యోతి రత్నం మృతి

రాంబిల్లి: గోవిందపాలెం మాజీ సర్పంచ్ ధూళి జ్యోతిరత్నం(50) అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందారు. ఈమె ఎంపీటీసీ సభ్యురాలిగా, సర్పంచ్‌గా సేవలందించారు. ప్రస్తుతం ఈమె వైఎస్సార్‌సీపీలో ఉన్నారు. ఈమె భర్త రాంబాబు తపాలా శాఖలో బీపీఎంగా పనిచేస్తున్నారు. కుమారుడు, కుమార్తె ఉన్నారు. జ్యోతిరత్నం మృతదేహాన్ని పలువురు నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు సందర్శించి నివాళులర్పించారు.



# అపర భగీరథుడు

- రైతుల గుండెల్లో కొలువైన మహానేత
- నేడు మహానేత రాజశేఖరరెడ్డి వర్ధంతి



పాయకరావుపేటలో తాండవనదిపై నిర్మించిన మినీ ఆనకట్ట

**ఎన్నో సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేసి.. వ్యవసాయాన్ని పండగ చేసి.. ప్రజా సంక్షేమమే శ్వాసగా, అభివృద్ధే ధ్యాసగా పాలన సాగించిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పాయకరావుపేట నియోజకవర్గంపై చెరగని ముద్రవేశారు. రైతే రాజు అని నమ్మి.. తాండవ నీరు అందించి జలయజ్ఞ ప్రదాతగా అన్నదాతల గుండెల్లో నిలిచారు వైఎస్సార్. శనివారం ఆ మహానేత వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కథనం**

నక్కపల్లి: మహానేత జ్ఞాపకాలు పాయకరావుపేట నియోజకవర్గ అన్నదాతల హృదయాల్లో ఇప్పటికీ పదిలంగా ఉన్నాయి. ముఖ్యంగా అన్నదాతలకు ఆయన చేసిన ఉపకారం చిరకాలం గుర్తుండిపోతుంది. దశాబ్దాలుగా ఈ ప్రాంత అన్నదాతలు ఎదుర్కొంటున్న సాగునీటి కష్టాలను తీర్చిన అపరభగీరథుడిగా ఆయన రైతుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి పాయకరావుపేట నియోజకవర్గంతో విడదీయరాని అనుబంధం ఉంది. రాజీవ్ పల్లెబాట కార్యక్రమంలో నియోజకవర్గంలో పర్యటించిన ఆయన ఆ సందర్భంగా ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారు. నియోజకవర్గంలో ప్రధానంగా తాండవ, వరాహ నదులపై మినీబ్యారేజీల నిర్మాణం ద్వారా దాదాపు 25 వేల ఎకరాలకు సాగునీరు అందించారు.

- తాండవ నదిపై రూ.8 కోట్లతో పాయకరావుపేట వద్ద మినీ ఆనకట్ట నిర్మించి రైతులకు తాండవ జలాలు వృథాగా పోకుండా అడ్డుకట్ట వేసి సాగుకు ఉపయోగపడేవిధంగా చర్యలుతీసుకున్నారు.
- దాదాపు 30 ఏళ్లుగా నియోజకవర్గ ప్రజలు ఎదురు చూస్తున్న 35 క్యూసెక్కుల తాండవ జలాలను పేట ప్రజలకు అందించారు. నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో సుమారు 20 కిలోమీటర్ల దూరం కలిగిన భూమి, ముఠా, ఆవ గ్రోయిన్‌ల ద్వారా తాండవ జలాలు చివరి ఆయకట్టు వరకు చేరే విధంగా ఉత్తర్వులు జారీ చేశారు. మహానేత నిర్ణయంతో ఖరీఫ్, రబీల్లో రెండు పంటలు పండించుకుంటున్నారు. పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారాగోదావరి నీటిని పాయకరావుపేట వరకు తరలించేందుకు రూ.25 కోట్లు కేటాయించారు.ఎస్.రాయవరం మండలంలో వరాహనది గ్రోయిన్‌లను రూ.5 కోట్లతో మరమ్మతులుచేపట్టి ఆయకట్టురైతులకు సాగునీరు అందించారు.

**నియోజకవర్గంలో పోలవరం పరవళ్లు...**

ప్రజాప్రస్థానంలో భాగంగా ఈప్రాంతంలో పాదయాత్రచేపట్టిన వైఎస్‌కు స్థానిక రైతులు పోలవరం ప్రాజెక్టు ఆవశ్యకతను వివరించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రాజెక్టును చేపడతానని హామీ ఇచ్చిన ఆయన సీఎం కాగానే పోలవరం పనులకు శ్రీకారం చుట్టారు. దీంతో పోలవరం ఎడమ కాలువ కింద పాయకరావుపేట నియోజకవర్గంలో 6,7,8 ప్యాకేజీలలో పాయకరావుపేటనుంచి యలమంచిలి వరకు కాలువ నిర్మాణపు పనులు 60శాతం పూర్తయ్యాయి. కాలువలో చేరిన వర్షపు నీటితో పాయకరావుపేట, నక్కపల్లి,ఎస్‌రాయవరం మండలాల్లో కాలువను ఆనుకుని ఉన్న పొలాల్లో రైతులు ఖరీఫ్‌తోపాటు రబీలో కూడా వరి పండిస్తున్నారు. ఏటా పోలవరం కాలువలో చేరిన నీటిని ఇంజిన్ల సహాయంతో ఉపయోగించి సుమారు 5వేల ఎకరాలు సాగు చేస్తున్నారు.

**తాగునీటి సమస్య పరిష్కారం..**

ఉద్దండపురం వద్ద 97 గ్రామాలకు తాగునీటి ఎద్దడి తీర్చే వాటర్‌గ్రిడ్‌కు రూ.36 కోట్లు కేటాయించి ఏలేరు కాలువనీటిని తరలించేందుకు పైపులైన్లు ఏర్పాటు, అనుమతులుమంజూరు చేశారు.ఉద్దండపురం వద్ద వాటర్‌ట్యాంకులు, స్టోరేజ్ ట్యాంకులు నిర్మించారు. అసంపూర్తిగా ఉన్న వాటర్‌గ్రిడ్ పూర్తిచేసేందుకు జగనమోహన్ రెడ్డి ప్రభుత్వం మరో రూ.86కోట్లు మంజూరు చేసింది.

**వైఎస్సార్ ఉపకారం మరిచిపోలేం**



దాదాపు 30 ఏళ్లపాటు తాండవ నీటికోసం రైతులంతా చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. నీటి కోసం రాత్రిసమయాల్లో కాలువ గట్లపై పడిగాపులు పడాల్సి వచ్చేది. వైఎస్సార్ అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గానికి రావాల్సిన నీటిని విడుదలచేసేందుకు చర్యలు తీసుకున్నారు. అప్పటినుంచి ఏటా రెండు పంటలు పండిస్తున్నారు. ఆయన చేసిన ఉపకారం తరతరాలుగా మర్చిపోలేం.

– పయిల నూకన్నాయుడు, రైతు ఒడ్డిమెట్ట

# వై.ఎస్.జగన్ మళ్లీ సీఎం కావడం తథ్యం

- కష్టపడి పనిచేసేవారికి పార్టీలో తగిన గుర్తింపు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్



వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి అప్పారావును సత్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించి, వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావడం తథ్యమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ తెలిపారు. ప్రతి కార్యకర్త పార్టీ విజయం కోసం శ్రమించాలన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శిగా నాగవరం గ్రామానికి చెందిన దాసరి అప్పారావు నియమితులు కావడంతో గురువారం రాత్రి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసేవారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు అభివృద్ధికి సీఎం తగిన ప్రాధాన్యత ఇస్తున్నారన్నారని చెప్పారు. సర్పంచ్ పాలిపిని రమణమ్మ,మాజీ ఎంపీపీ దాసరి గౌరీ లక్ష్మి,ఉప సర్పంచ్ పాలిపిని నాయుడు,పాలసంఘ అధ్యక్షుడు గనిశెట్టి వెంకటరావు,వార్డు సభ్యులు అప్పికొండ శ్రీనివాసరావు, బుదిరెడ్డి కోటేశ్వరరావు, అప్పికొండ సంతోష్, పాలిపిని అప్పారావు, కాటకోట నరసింగరావు, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నేడు వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు



వైఎస్సార్ వర్ధంతికి ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

నక్కపల్లి: మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని శనివారం నక్కపల్లి మండలంలో పలు సేవాకార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వీసం రామకృష్ణ తెలిపారు. ముందుగా పార్టీ కార్యాలయం వద్ద ఉన్న దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిస్తామన్నారు. అనంతరం నక్కపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. తదుపరి రెండు వేల మందికి అన్నదానం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేసినట్టు ఆయన చెప్పారు. మండలంలో అన్ని గ్రామా ల్లో సర్పంచ్‌లు,ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గ్రామశాఖ అధ్యక్షులు ఆయా గ్రామాల్లో వైఎస్సార్ వర్ధంతిని నిర్వహించి మహానేతకు ఘనంగా నివాళులర్పించిన అనంతరం పార్టీ కార్యాలయం వద్ద జరిగే కార్యక్రమానికి తరలిరావాలని ఆయన కోరారు.

## పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



ఉమ్మలాడలో పర్యటిస్తున్న జిల్లా మలేరియా అధికారి వరహాల దొర

మునగపాక: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రత తప్పని సరిగా పాటించాలని జిల్లా మలేరియా అధికారి కె.వరహాల దొర కోరారు. డ్రై డేలో భాగంగా మండలంలోని ఉమ్మలాడలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగ్యూ,చికెన్ గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. సహాయ మలేరియా అధికారి పి.జె.ఎం.ఆర్.పి. నాయుడు,సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసరావు,ఆరోగ్య పర్యవేక్షకులు నాగేశ్వరరావు, సురేష్, అశోక్, వైద్య సిబ్బంది పి.ఎస్.వి.అప్పారావు,ఎంఎల్‌హెచ్‌పీ అంజుం తదితరులు పాల్గొన్నారు.

## 10 నుంచి 25 వరకూ ఇంటింటా ధర్మ ప్రచారం



కొండకర్ల రామాలయంలో సమావేశమైన సమరసత సేవా ఫౌండేషన్ మండల సభ్యులు

అచ్యుతాపురం(అనకాపల్లి): ఇంటింటా ధర్మ ప్రచారాన్ని ఈ నెల 10 నుంచి 25 వరకూ నిర్వహించాలని సమరసత సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ కన్వీనర్ బి.వి.రమణ అన్నారు. అచ్యుతాపురం మండలంలోని కొండకర్ల రామాలయంలో సమరసత సేవా ఫౌండేషన్ మండల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ధార్మిక కమిటీలు బలపడాలని తెలిపారు. పౌర్ణమి నాడు దేవాలయాల్లో సామూహిక హారతి నిర్వహించాలని, ఈ నెల 17న విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఏకాదశి నాడు నగర సంకీర్తన జరపాలన్నారు.కొల్లి అప్పారావు,గుడివాడ రమణ,కట్టమూరి శ్రీనివాసరావు,సన్నిధి ఈశ్వరరావు,భువనేశ్వరరావు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇంకుడు గుంతలు



ఇంకుడు గుంతల పనులు ప్రారంభిస్తున్న నాయకులు

నక్కపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశారు. శుక్రవారం ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, ఏపీయూఎఫ్ఐడీసీ డైరెక్టర్ వీసం రామకృష్ణ తదితరులు ఈ ఇంకుడు గుంతల నిర్మాణపు పనులు ప్రారంభించారు. వర్షపు నీటిని స్టోరేజీ చేయడం, భూగర్భజలాలు పెంపొందించడం కోసం ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల ముందు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అంబేడ్కర్, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, సర్పంచ్ తళ్ల బార్గవ్,ఎంపీటీసీ గొర్ల గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ కనెక్షన్లకు ఆధార్ లింక్ తప్పనిసరి



ఆధార్ అనుసంధానం చేస్తున్న విద్యుత్ సిబ్బంది

యలమంచిలి: విద్యుత్ కనెక్షన్లతో ఆధార్ కార్డు, ఫోన్ నంబర్‌ను విధిగా అనుసంధానం చేయాలని యలమంచిలి విద్యుత్ డీఈ బి.రఘు అన్నారు. స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద వినియోగదారుల ఆధార్ కార్డు అనుసంధాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని విద్యుత్ వినియోగదారులందరూ తమ ఆధార్‌కార్డు జెరాక్స్ కాపీ, కరెంట్ బిల్లులను స్థానిక విద్యుత్ కార్యాలయంలో అందజేస్తే అనుసంధానం చేయడం జరుగుతుందని చెప్పారు. వివరాలకు యలమంచిలి ఏఈ సంప్రదించాలని తెలిపారు.

## ముగిసిన ధ్యాన మహాచక్రం



ధ్యానం గురించి వివరిస్తున్న నిర్వాహకులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం-అందలాపల్లి శ్రీధ్యానాశ్రయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన శ్రీగిజా పిరమిడ్ శ్రీ ధ్యాన మహా చక్రం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వాహకులు ధ్యానం ప్రాధాన్యత గురించి వివరించారు.

## శ్రావణ పౌర్ణమి సామూహిక హారతి



సామూహిక హారతి ఇస్తున్న మహిళలు

కశింకోట: వెదురుపర్తిలో శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం అర్ధరాత్రి వరకు సత్సంగం, సామూహిక హారతి కార్యక్రమాలను నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని హారతి ఇచ్చారు. హిందూ ధర్మం గురించి ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ నక్కా సత్యనారాయణ భక్తులకు వివరించారు.

# అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



నూతన పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు



రామన్నపాలెంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



మునగపాకలో పింఛన్ అందజేస్తున్న ఎంపీటీసీ-3 గణేష్

ఎస్.రాయవరం: అర్హులైన అందరికీ పారదర్శకంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నారని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో నూతనంగా మంజూరైన పింఛన్లను కొరుప్రోలు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నక్కపల్లి మండలంలో 220 మందికి, పాయకరావుపేట మండలంలో 250 మందికి కొత్తగా పింఛన్లు అందజేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో నక్కపల్లి, పాయకరావుపేట జెడ్పీటీసీలు గోసల కాసులమ్మ, లంక సూరిబాబు,నక్కపల్లి ఎంపీపీ రత్న, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శీరం నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మునగపాక: అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేస్తున్నామని మునగపాక ఎంపీటీసీ-3 బోడకుర్తి గణేష్ తెలిపారు. మునగపాకలో ఆయన శుక్రవారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటింటికీ వెళ్లి అర్హులకు పింఛన్లు అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని రామన్నపాలెంలో శుక్రవారం పింఛన్ల పంపిణీ చేశారు. ఎంపీటీసీ లాలం శ్రీను,సచివాలయం కన్వీనర్ నాయుడు బాబు,డీపీఎస్ నాయుడు,సురేష్,రాము,శ్రీరాములు పాల్గొన్నారు.

అచ్యుతాపురం మండలంలోని గొర్లె ధర్మవరానికి చెందిన కిడ్నీ వ్యాధిగ్రస్తుడు గొర్లె అప్పలరాజుకు శుక్రవారం రూ.పది వేల పింఛన్ అందజేశారు. డయాలసిస్ చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఎమ్మెల్యే కన్నబాబు రాజు సహకారంతో ఈ పెన్షన్‌ను అందించగలిగామని సర్పంచ్ గొర్లె అశ్విని నూకరాజు తెలిపారు.మడక కోటేశ్వరరావు,గొర్లె రామజోగి,నానేపల్లి తాతినాయుడు,గొర్లె గంగునాయుడు,గొర్లె చిరంజీవి,గొర్లె రమణ,గొర్లె శ్రీనివాసరావు,గొర్లె సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



కిడ్నీ వ్యాధిగ్రస్తునికి పింఛన్ అందజేస్తున్న దృశ్యం



మామిడివాడలో పింఛన్ల పంపిణీ చేస్తున్న వలంటీర్లు

రాంబిల్లి: మండలంలో శుక్రవారం పింఛన్ల ప్రక్రియ జోరుగా సాగుతోంది. వేకువజాము నుంచే వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. వలంటీర్లతో పాటు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు , ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీడీవో కె.ఎస్. కొండలరావు పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

## గెస్ట్ లెక్చరర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

యలమంచిలి: స్థానిక శ్రీగురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్రం,చరిత్ర, ఆంగ్లం,వృక్షశాస్త్రం సబ్జెక్టులు బోధించేందుకు గెస్ట్ లెక్చరర్లుగా పనిచేయడానికి ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పి.చంద్రశేఖర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.ఆయా సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులు సాధించాలని పీహెచ్‌డీ,నెట్, సెట్ క్వాలిఫై అయిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ నెల 7వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

## విద్యుత్ చార్జీలు తగ్గించాలి

కోటవురట్ల/మునగపాక/అచ్యుతాపురం(అనకాపల్లి): పెరిగిన నిత్యావసర సరకుల ధరలు, విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు కోటవురట్ల, మునగపాక, అచ్యుతాపురంమండలా ఎంపీడీవో కార్యాలయం, సచివాలయాల వద్ద ఆందోళన చేసి, అధికారులకు వినతిపత్రాలుఅందజేశారు.

# భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు



శ్రీదేవి, భూదేవి సమేత వల్లభనారాయణస్వామి



భక్తులకు దర్శనమిచ్చిన వరలక్ష్మి



జంపపాలెంలో భక్తులు అందజేసిన మకరతోరణం

రాంబిల్లి: దిమిలి గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వల్లభ నారాయణస్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ దేవి వ్రతాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు నేతేటి రామచంద్రాచార్యులు, నేతేటి గోపాలకృష్ణ శాస్త్రోక్తంగా వ్రతాలు జరిపారు. వరలక్ష్మీవ్రతం విశిష్టతను వివరించారు. దిమిలి పరిసర గ్రామాల భక్తులు ఈ సామూహిక వ్రత పూజల్లో పాల్గొన్నారు.

**కనకదుర్గమ్మకు మకరతోరణం**

యలమంచిలి: మండలంలోని జంపపాలెం గ్రామంలో శ్రీకనకదుర్గమ్మ అమ్మవారికి గ్రామస్తులు,దాతలు వెండి మకరతోరణం అందజేశారు. 3వ శ్రావణ శుక్రవారం సందర్భంగా శ్రీకనకదుర్గమ్మవారికి ఆలయ కమిటీ చైర్మన్ ఆడారి రమణబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

## చిరుధాన్యాల్లో అధిక పోషక విలువలు



పోషణ్ సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త ప్రసాదరావు

అచ్యుతాపురం(అనకాపల్లి): చిరుధాన్యాల్లో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయని, చిరు ధాన్యాలతో పలు రకాల వంటలు చేయవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వి.ప్రసాదరావు తెలిపారు. అచ్యుతాపురం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఏషియన్ పెయింట్స్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.ట్రైనర్ లక్ష్మి మాట్లాడుతూ సేంద్రియ పద్ధతుల్లో కిచెన్ గార్డెన్‌ను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.సేంద్రియ పద్ధతుల ద్వారా పండించే పంటల్లో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు.10 గ్రామాలకు చెందిన రైతులకు చిరుధాన్యాలపై నిర్వహించిన సదస్సులో ఏషియన్ పెయింట్స్ హెచ్ఆర్ ఉదయ్, చందన గౌతం తదితరులు పాల్గొన్నారు.